ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 28 జూలై 2024

మాజీ ఐఏఎస్‌లతో విజయ్ మంతనాలు?

● పార్టీ విధివిధానాల తయారీపై కసరత్తు



అడయార్, జూలై 27: అగ్ర హీరో విజయ్ తమిళ వెట్రి కళగం (టీవీకే) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించగా, ఈ పార్టీ విధి విధానాలను ఖరారు చేసే అంశంపై పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారులతో సమీక్షా సమావేశాలు జరుపుతున్నారు. పార్టీ సిద్ధాంతాలు ఏ విధంగా ఉండాలన్న అంశంపై వారి నుంచి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నారు. ఇందులోభాగంగా ఆయన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులో వరుసగా సమావేశాలు జరుపుతున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. టీవీకే రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్.. 2026లో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలన్న తలంపులో ఉన్నారు. ఆ దిశగానే ఆయన అడుగులు వేస్తున్నారు. ఇందులోభాగంగా, ఆయన అభిమానులు అనేక రకాలైన సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో నియోజకవర్గాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతిని ప్రదానం చేసి, వారిని అభినందించారు. అంతేకాకుండా, కళ్ళకుర్చి కల్తీసారా ఘటనకు సంబంధించి ఆయన నేరుగా వెళ్ళి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ అలసత్వం కారణంగానే ఈ మహా ఉదంతం జరిగిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుండగా, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పార్టీ మహానాడు నిర్వహణ కోసం జిల్లాల వారీగా విజయ్ అభిమానులు, టీవీకే కార్యకర్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, మహానాడును నిర్వహించే స్థలాన్ని ఆయన ఎంపిక చేసి, ఒక నివేదికను విజయ్‌కు సమర్పించినట్టు సమాచారం. ఈ మహానాడుకు ఒక్క తమిళనాడు నుంచే కాకుండా, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అభిమానులు భారీగా తరలివస్తారని భావిస్తున్నారు. అందువల్ల మహానాడు జరిగే స్థలం సౌకర్యవంతంగా ఉండేలా దృష్టిసారించారు. త్వరలోనే టీవీకే మహానాడు జరిగే స్థలాన్ని విజయ్ అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు, విజయ్ పార్టీ విధి విధానాల రూపకల్పనలో పూర్తిగా నిమగ్నమైవున్నారు. ఇందుకోసం ఆయన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో సమావేశమై సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు.

నీలగిరిపై పగబట్టిన వరుణుడు

మళ్లీ వర్షాలు ● కూలిన చెట్లు, మట్టి పెళ్లలు

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో శుక్రవారం నుంచి మళ్లీ వర్షాలు ప్రారంభమయ్యాయి. రెండు వారాలు కుండపోత వర్షాలకు జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. మూడు రోజులకు ముందు వర్షాలు ఆగినా పెనుగాలులు వీచాయి. దీంతో పలు ప్రాంతాల్లోని ఇళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ప్రధాన రహదారుల్లో వృక్షాలు కూలాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పెనుగాలులతో వర్షాలు కురిశాయి. దీంతో కుందా జోన్‌కు చెందిన పాకండి ప్రాంతంలో 30 అడుగుల ఎత్తునుంచి మట్టిపెళ్లలు జారీ రహదారిపై పడ్డాయి. దీంతో ఎడక్కాడులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఊటీలో కుళించోలై, జల్లికుళి, ఫింగర్‌పోస్ట్, మంజూరు, అవలాంచి ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇదే విధంగా కుందా వంతెన సమీపంలో ఓ భారీ వృక్షం నేలకొరగటంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. రహదారుల శాఖ, అగ్ని మాపక దళం సభ్యులు ఆ ప్రాంతాలకు వెళ్లి చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.



అవలాంచి రహదారిలో కూలిన చెట్టును పరిశీలిస్తున్న అధికారులు

అబ్దుల్ కలాంకు ఘననివాళి



రాజ్‌భవన్‌లో పాఠశాల విద్యార్థులతో కలసి అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, జూలై 27: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని పేకరుంబులో ఉన్న అబ్దుల్ కలాం జాతీయ స్మారక మందిరంలో శనివారం ఉదయం కుటుంబ సభ్యులు, ప్రజలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సమాధి చుట్టూ సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోన్ పాఠశాల విద్యార్థులతో కలసి పూలు చల్లి నివాళి అర్పించారు. అలాగే, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు కలాంకు నివాళి అర్పించారు. అబ్దుల్ కలాం అంతర్జాతీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేకరుంబులో సేవా కార్యక్రమాలు జరిగాయి. కాగా, స్థానిక గిండిలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి గవర్నర్ ఆర్ఎన్ రవి విద్యార్థులతో కలసి అంజలి ఘటించారు.



అబ్దుల్ కలాం స్మారక మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు





చెన్నై కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొన్న ఎంపీలు దయానిధి మారన్, కళానిధి వీరాసామి, మేయర్ ప్రియ తదితరులు - తూత్తుకుడి ధర్నాలో నినాదాలు చేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి, పార్టీ నేతలు

కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర నిరసన

డీఎంకే ధర్నాలతో దద్దరిల్లిన రాష్ట్రం

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించి కొత్త పథకాలు, నిధుల కేటాయింపుల ప్రస్తావనలు లేకపోవడాన్ని ఖండిస్తూ అధికార పార్టీ డీఎంకే ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు జరిగాయి. ఒకే సమయంలో అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగిన ఈ ఆందోళనల్లో వేలసంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పలు చోట్ల రాస్తారోకోలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఆందోళనలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చెన్నైలో..

నగరంలో నాలుగు చోట్ల ధర్నాలు జరిగాయి. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు డీఎంకే ఎంపీ దయానిధి మారన్ నాయకత్వం వహించారు. పార్టీ జిల్లా శాఖ కార్యదర్శులు ఆర్డీ శేఖర్, మాధవరం సుదర్శనం, మేయర్ ఆర్ ప్రియ, ఎంపీ కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు జోసెఫ్ సామువేల్, తాయగం కవి, వెట్రిఅళగన్, పరంధామన్, ఎబినేజర్, ఐడ్రీం మూర్తి, కేపీ శంకర్, మాజీ ఎమ్మెల్యే రంగనాథన్, మండల కమిటీ నాయకుడు నేతాజీ గణేషన్, పార్టీ సాహిత్య విభాగం కార్యదర్శి పీటీ పాండి, ఎస్ సెల్వం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి నిధుల మంజూరులో పక్షపాతం వద్దు, రాష్ట్రంపై ఎందుకింత కక్ష అంటూ నాయకులంతా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సైదాపేటలో...

సైదాపేట లిటిల్ మౌంట్‌లో జరిగిన ధర్నాకు డీఎంకే జిల్లా కార్యదర్శి సిట్రరసు నాయకత్వం వహించారు. ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు మయిలై డి.వేలు, ఎళిల్‌అరసన్, కె.గణపతి, పూచ్చి మురుగన్, అన్బగంకళై, కాశిముత్తు మాణిక్కం, ధనశేఖరన్, కన్నన్, టి.నగర్ శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు.

తాంబరంలో...

తాంబరం షణ్ముగం రోడ్డులో జరిగిన ధర్నాకు శ్రీపెరుంబుదూరు లోక్‌సభ సభ్యుడు టీఆర్ బాలు నాయకత్వం వహించారు. ఎమ్మెల్యేలు ఎస్.ఆర్.రాజా, ఇ.కరుణానిధి, వరలక్ష్మి, మధుసూదనన్, తాంబరం మేయర్ వసంతకుమారి, డిప్యూటీ మేయర్ కె.కామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవడిలో...

ఆవడి కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో జరిగిన ధర్నాకు డీఎంకే తిరువళ్లూరు సెంట్రల్ కార్యదర్శి ఎస్ఎం నాజర్ నాయకత్వం వహించారు. ఎమ్మెల్యే కృష్ణస్వామి, మేయర్ ఉదయకుమార్, సన్ ప్రకాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తూత్తుకుడిలో..

తూత్తుకుడిలో జరిగిన ధర్నాలో డీఎంకే మహిళా విభాగం నాయకురాలు, ఎంపీ కనిమొళి పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడంపై పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను నిలదీశానని, తమిళభాష, తమిళ ప్రజలు, తిరువళ్లువర్‌అంటే ఎంతో ఇష్టమని చెప్పుకునే మోదీ చివరకు రాష్ట్రంలో పార్టీని గెలిపించలేదనే కోపంతో ప్రజలపై కక్ష తీర్చుకున్నారని విమర్శించానని చెప్పారు. ఇక రాష్ట్రంలో బీజేపీకి తావుండదని, తమిళ ప్రజలంతా ఆ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్రను పోషించే రాష్ట్రంపై కేంద్ర సవతి తల్లి ప్రేమను ప్రదర్శించడం గర్హనీయమన్నారు. చెన్నై గిండీ వద్ద జరిగిన ధర్నాలో ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, మంత్రి ఎం.సుబ్రమణ్యం పాల్గొన్నారు. కడలూరులో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద, సేలం జిల్లా కోట మైదానంలో జరిగిన ధర్నాలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తమిళ ప్రజానీకంపై కక్షగడతారా?

● బీజేపీకి గుణపాఠం తప్పదు


● ఇకపై రాష్ట్రంలో మరిన్ని ఓటములే ● సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీకి ఓటేసి గెలిపించలేదన్న ఆగ్రహంతో తమిళ ప్రజానీకంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షగట్టిందని, ఇకపై రాష్ట్రంలో ఆ పార్టీకి వరుసగా ఘోర పరాజయాలు తప్పవని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ హెచ్చరించారు. బడ్జెట్‌లో ఒకటి రెండు కొత్త పథకాలు ప్రకటించి ఉంటే, కనీసం యేళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న పథకాలకు నిధులైనా కేటాయించి ఉంటే శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటైన నీతి ఆయోగ్ సమావేశంలో తాను పాల్గొని ఉండేవాడినని చెప్పారు. ఈ మేరకు ఆ సమావేశంలో పాల్గొనకపోవడానికి కారణాలు వివరిస్తూ వీడియో సందేశం వెలువరించారు. రాష్ట్రంలో మూడేళ్లకు పైగా ప్రజాభిమానాన్ని మూటగట్టుకుని సాగుతున్న డీఎంకే ద్రావిడ తరహా పాలనలో అన్ని వర్గాల ప్రజలు పథకాల ఫలితాలను పొందుతున్నారని తెలిపారు. కేంద్రంలో డీఎంకే సిద్ధాంతాలను వ్యతిరేకించిన ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కూడా బడ్జెట్‌లో రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శించలేదని, నిధులు విడుదల చేయకుండా మొండివైఖరిని ప్రదర్శించలేదని స్టాలిన్ గుర్తు చేశారు. రాజకీయాలు వేరు పాలన వేరు అనే రీతిలో అన్ని రాష్ట్రాలను సమాన దృష్టిలో చూడాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల రాష్ట్రానికంటూ ఎలాంటి పథకాలు అమలు చేయలేదని, ప్రకటించిన మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణం పునాది పనులకు కూడా నోచుకోలేదన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక బీజేపీ పాలకులలో మార్పు వస్తుందని, అన్ని రాష్ట్రాలను సమానంగా ఆదరిస్తుందని ఆశించిన ప్రతిపక్షాలకు నిరాశే మిగిలిందన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం రాజ్యాంగానికే విరుద్ధమని, పాలకులు చేసిన ప్రమాణానికి కూడా వ్యతిరేకమని స్టాలిన్ అన్నారు.

వంద అడుగులకు చేరిన మేట్టూరు డ్యాం

● నేటినుంచి జలాల విడుదల

అడయార్, జూలై 27: మేట్టూరు రిజర్వాయర్ నీటి మట్టం వంద అడుగులకు చేరుకుంది. ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో హొగెనేకల్‌కు వచ్చే నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం 1.16 లక్షల ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా మేట్టూరు డ్యాం నీటిమట్టం క్రమంగా పెరిగింది.



ముఖ్యంగా, శనివారం ఉదయం డ్యాంలోకి 93,828 ఘనపుటడుగుల మేరకు జలాలు ప్రవేశించాయి. దీంతో డ్యాం నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 9.15 గంటల సమయంలో డ్యాం నీటి మట్టం 100 అడుగులు దాటింది. దీంతో ఎడమగట్టున జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ సెల్వరాజ్, ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కావేరీ నదీ జలాల్లో పూలు చల్లారు. గత యేడాది జూన్ 17న మేట్టూరు డ్యాం నీటిమట్టం 100.29 అడుగులుగా ఉండగా, మరుసటి రోజు ఈ డ్యాం నీటిమట్టం 99.64 అడుగులకు తగ్గిపోయింది. ఆ తర్వాత ప్రస్తుతం ఈ డ్యాం నీటిమట్టం వంద అడుగులకు చేరుకోవడం గమనార్హం. ఇదిలావుండగా ఎగువ ప్రాంతాల నుంచి మేట్టూరు డ్యాంకు వచ్చే నీరు లక్ష ఘనపుటడుగుల కంటే ఎక్కువగా చేరుతుండగా కావేరీ నది వెంబడి ఉన్న ప్రాంతాలవాసులను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే, వరద హెచ్చరికలను కూడా జారీ చేశారు. అడిప్పలారు, శెట్టిపట్టి, కోట్టైయూర్, పన్నవాడి ప్రాంతాలకు చెందిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని రెవెన్యూ అధికారులు దండోరా వేసి అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా కావేరీ నదిలో జాలర్లు చేపల వేటకు లేదా పడవ సవారీ, లేదా బట్టలు ఉతికేందుకు వెళ్లవద్దని హెచ్చరించారు.

నేడు మేట్టూరు నుంచి నీటి విడుదల

కావేరీ డెల్టా ప్రాంతాల్లో ఆడి పెరుక్కు వేడుకలను అంత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలను పురస్కరించుకుని మేట్టూరు నుంచి జలాలను విడుదల చేయనున్నారు. ముఖ్యంగా సేలం, ఈరోడ్, తిరుచ్చి, కరూర్, తంజావూరు, నాగపట్టణం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ ఆడిపెరుక్కు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. దీంతో ఈ నెల 28వ తేదీ ఆదివారం నుంచి ఆగస్టు 3వ తేదీ శనివారం వరకు ఈ జలాలను విడుదల చేయనున్నారు. ఈ వేడుకలు ముగిసిన తర్వాత కూడా డ్యాం నుంచి పంటల సాగు కోసం రోజుకు 500 ఘనపుటడుగుల జలాలను విడుదల చేసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు సూచన ప్రాయంగా వెల్లడించారు.

ముమ్మరంగా తాబరం రైల్వే స్టేషన్ విస్తరణ పనులు

సబర్బన్ రైళ్ల సేవల తగ్గింపుతో ప్రయాణికుల ఇబ్బంది ● జీఎస్టీ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

ప్యారీస్, జూలై 27: స్థానిక తాంబరం రైల్వేస్టేషన్ విస్తరణ పనులు ముమ్మరంగా చేపడుతున్న కారణంగా ఆ మార్గంలో నడిపే సబర్బన్ రైళ్ల సేవలు తగ్గించారు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. 8 ప్లాట్‌ఫాంలున్న తాంబరం రైల్వేస్టేషన్‌లో మూడో టెర్మినల్‌గా మార్పు చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇది అందుబాటులోకి వస్తే ఈ మార్గం గుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లు అదనంగా నడిపేందుకు వీలుంటుంది. దీంతో కొత్తగా రెండు రైలు మార్గాలు నిర్మిస్తున్నారు. అంతేకాకుండా, గూడ్సు రైళ్లకు అంతరాయం లేకుండా వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఏర్పాటవుతోంది. ప్రస్తుతం ఈ విస్తరణ పనులకు సంబంధించి సిగ్నళ్లు, పాయింట్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందువల్ల ఈనెల 23వ తేది నుంచి ఆగస్టు 14వ తేది వరకు ఈ మార్గంలో సేవలను దక్షిణ రైల్వే శాఖ మార్పు చేసింది. అయితే, చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గంలో ప్రయాణిస్తున్న ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సెలవు రోజైన శని, ఆదివారాల్లో మాత్రం రైళ్ల సేవలు మార్పు చేసింది. ఆ మేరకు శనివారం ఉదయం 9.20 గంటల అనంతరం తాంబరం - చెన్నై బీచ్ - చెంగల్పట్టు మధ్య నడిపే రైళ్లు రద్దు చేశారు. ఇదే సమయంలో ప్రత్యేక రైళ్లను యథావిధిగా నడిపారు. అందువల్ల ఈ రైళ్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది.

1 నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పు...

ఆగస్టు 1వ తేది నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు చేపట్టనున్నట్టు దక్షిణ రైల్వే శాఖ ప్రకటించింది. తాంబరం నుంచి ప్రతిరోజు రాత్రి నాగర్‌కోయిల్‌కు బయల్దేరే అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌ను 14వ తేది వరకు రద్దు చేసింది. ఎగ్మూర్ నుంచి ప్రతిరోజు ఉదయం 5.35 గంటలకు కారైక్కుడి బయల్దేరే రైలు, సాయంత్రం 3.45 గంటలకు బయల్దేరే పల్లవన్ ఎక్స్‌ప్రెస్ చెంగల్పట్టు నుంచి యల్దేరుతాయి. అదే విధంగా ఎగ్మూర్ నుంచి బయల్దేరాల్సిన వైగై, రాక్‌ఫోర్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా చెంగల్పట్టు నుంచి బయల్దేరుతాయి.

స్తంభించిన ట్రాఫిక్... : చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు మధ్య 55 సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. దీంతో శనివారం ఉదయం 9.20 నుంచి సబర్బన్ రైళ్లు అందుబాటులో లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. తాంబరం ప్రాంతం నుంచి విద్యుత్ రైళ్లలో చెన్నైకి రావాల్సిన ప్రయాణికులు ఎంటీసీ బస్సులను ఆశ్రయించారు. దీంతో తాంబరంలో ఉన్న జీఎస్టీ రోడ్డు కిటకిటలాడింది. అక్కడి నుంచి నగరం వైపు బయల్దేరిన సిటీ బస్సుల కారణంగా జీఎస్టీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టు ఎంటీసీ బస్సులు నడపకపోవడంతో బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు పోటీ పడ్డారు.



బీచ్ రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికుల రద్దీ

సమాచార దర్శిని

టీఎన్‌పీఎస్సీ రాత పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 27: వివిధ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నిర్వహించనున్న రాత పరీక్షకు ఆగస్టు 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన సాంకేతిక విభాగాల్లో 654 పోస్టులు ఖాళీగా వున్నాయి. వాటిని ఇంటర్వ్యూ లేకుండా రాత పరీక్ష ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబరు 26వ తేదీన తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాత పరీక్ష నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు సూచించారు.

ఈదురు గాలులతో రోప్‌కార్ సేవలకు అంతరాయం

ఐసిఎఫ్, జూలై 27: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ రోప్ కారు సేవలకు ఈదురు గాలుల వల్ల అంతరాయం కలుగుతోంది. ఈ ఆలయానికి వెళ్లేందుకు వించ్, రోప్‌కార్, మెట్ల దారి వంటి మార్గాలున్నాయి. రోప్‌కారులో 3 నిమిషాల్లో భక్తులు ఆలయానికి చేరుకోవచ్చు. ప్రస్తుతం ఆడిమాసం ఈదురు గాలులతో భద్రత దృష్ట్యా రోప్‌కారు సేవలు నిలిపివేశారు. దీంతో భక్తులు మెట్ల మార్గం, వించ్ సేవలను వినియోగించుకుంటున్నారు.

పీజీ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 27: ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో మొదటి సంవత్సరం పీజీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరణ శనివారం ప్రారంభమైంది. విద్యార్థులు ww-w.tn-ga-sa.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేనివారు కళాశాలల్లో వున్న అడ్మిషన్ సహాయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము ఒక విద్యార్థికి రూ.60 చెల్లించాల్సివుంటుంది. ఇతర వివరాలకు నెం. 04424343106, 24342911లలో సంప్రదించవచ్చు.

ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లకు తాంబరంలో ప్రత్యేక మార్గం

ఐసిఎఫ్, జూలై 27: స్థానిక తాంబరంలో ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయనున్నారు. తాంబరం రైల్వేస్టేషన్‌ను ప్రతిరోజూ 2 లక్షల మంది వినియోగిస్తున్నారు. చెంగల్పట్టు - తాంబరం - చెన్నై బీచ్ మధ్య 300కు పైగా సబర్బన్ రైళ్లు, దక్షిణాది జిల్లాలకు ప్రతిరోజూ 60కి పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఇక్కడి నుంచే నడుస్తున్నాయి.ఈరైల్వేస్టేషన్‌ను మూడో టెర్మినల్‌గా మార్చే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. తాంబరం రైల్వేస్టేషన్‌లో 8 ప్లాట్‌ఫారాలుండగా, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపేందుకు అదనంగా రెండు మార్గాలు, గూడ్సు రైళ్లకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

18 సబ్ జైళ్ల మూసివేతకు ఆదేశాలు

ఐసిఎఫ్, జూలై 27: రాష్ట్రంలో వున్న 18 సబ్ జైళ్లను మూసివేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరుకున్న, మౌలిక వసతులు లేని భద్రతా లోపాలున్న జైళ్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిన సుప్రీంకోర్టు.. రెవెన్యూ, న్యాయ, జైళ్లశాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం అన్ని సబ్ జైళ్లను తనిఖీ చేసి వాటిల్లో 18 జైళ్లు భద్రతా రాహిత్యంగా ఉన్నట్లు నివేదికలో పేర్కొంది. ఈ మేరకు ఆయా సబ్ జైళ్లను అధికారులు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అవార్డులకు దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్, జూలై 27: ఈ సంవత్సరం ఐదు రకాల అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'దేవనేయ సావనర్, వీర మామునివర్, తూయ తమిళ్ ఊడగం, నల్లతమిళ్ పావలర్, తూయ తమిళ్ పత్రాకర్ పురస్కారాలు, తమిళ్ భాషావేత్తలకు బహుమతులు అందజేయనున్నారు. ఔత్సాహికులు http://sorkuvai.tn.gov.in వెబ్‌సైట్ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన అనంతరం awards.tn.gov.in. వెబ్‌సైట్‌లో ఆగస్టు 30వ తేదీ లోగా అప్‌లోడ్ చేయాలి. ఇతర వివరాలకు నెం.04429520509లో సంప్రదించవచ్చు.

1792 యూనిట్లు పెరిగిన వ్యక్తిగత విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, జూలై 27: రాష్ట్రంలో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 2023-24లో 152 యూనిట్లు పెరిగి 1792 యూనిట్లకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటలు (ఒక రోజు) వినియోగించే విద్యుత్ పరిమాణాన్ని విద్యుత్ వినియోగం అంటారు. ఇది ప్రతిరోజూ 30 కోట్ల యూనిట్లుగా వుండగా, వేసవిలో దీని పెరుగుదల గణనీయంగా ఉంటుంది. ఆ ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ నాటికి 45.43 కోట్ల యూనిట్లుగా పెరిగింది. ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా వినియోగించిన మొత్తం విద్యుత్ వినియోగాన్ని మొత్తం జనాభా లెక్కతో భాగిస్తే వచ్చే శేషాన్ని వ్యక్తిగత విద్యుత్ వినియోగంగా పిలుస్తారు. ఇది 2023-24లో 1792 యూనిట్లుగా పెరిగింది. 2022-23లో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 1640 యూనిట్లుగా వుంది.

1న ప్రతిపక్ష పార్టీల ఆందోళన

ఐసిఎఫ్, జూలై 27: కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ఆగస్టు 1న ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నాయి. ఈ మేరకు ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, రాష్ట్రానికి వ్యతిరేకంగా ఉన్న ఆ బడ్జెట్ తీరును ఖండిస్తూ సీపీఎం, సీపీఐ, వీసీకే వంటి పార్టీలు ఆందోళనకు పిలుపునిచ్చాయి.

కోవైలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

ఐసిఎఫ్, జూలై 27: కోయంబత్తూరులో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం 20.72 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఇందుకోసం ఒండిపుదూర్ ఓపెన్ జైలు మైదానంలో స్టేడియం నిర్మాణానికి కోయంబత్తూరు కార్పొరేషన్ స్థలం కేటాయించింది. త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించనున్నామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

చెన్నై తిరిగొచ్చిన అండమాన్ విమానం

పెరంబూర్, జూలై 27: నగరం నుంచి అండమాన్‌కు వెళ్లిన ఎయిర్ ఇండియా విమానం, వాతావరణం అనుకూలించక పోవడంతో మళ్లీ చెన్నైకి తిరిగొచ్చింది. శనివారం ఉదయం 5.15 గంటలకు 98 మంది ప్రయాణికులతో మీనంబాక్కం విమానాశ్రయం నుంచి విమానం బయల్దేరి వెళ్లింది. అండమాన్‌లో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించక పోవడంతో విమానం గంట పాటు ఆకాశంలో చక్కర్లు కొట్టింది. అయినా వాతావరణం సద్దుమణగపోవడంతో ఆ విమానం మళ్లీ నగరానికి తిరిగొచ్చింది. ప్రయాణికులకు విమానాశ్రయంలో వసతి ఏర్పాటు చేసినట్లు, వాతావరణం అనుకూలించాక విమానం బయల్దేరి వెళుతుందని అధికారులు తెలిపారు.

బీజేపీ మాజీ ఎంపీ మాస్టర్ మదన్ మృతి



మాస్టర్ మదన్(ఫైల్‌ఫొటో)



మాస్టర్ మదన్ భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి లోక్‌సభ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత మాస్టర్ మదన్ మృతిచెందారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. మాస్టర్ మదన్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన జారీ చేశారు. కోయంబత్తూరు జిల్లా పెరియనాయకన్ పాళయం సమీపంలోని ప్రెస్ కాలనీ బాలాజీ గార్డెన్‌లో నివసిస్తున్న మాస్టర్ మదన్ గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలకు తోడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంటిపట్టునే ఉంటూ వైద్యుల ద్వారా చికిత్సలందుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ సమాచారం తెలియగానే జిల్లావ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాస గృహానికి చేరుకుని నివాళి అర్పించారు. శనివారం ఉదయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితర నేతలు మాస్టర్ మదన్ నివాసానికి చేరుకుని ఆయనకు భౌతికికాయానికి నివాళి అర్పించారు. పార్టీ సీనియర్ నేత మాస్టర్ మదన్ మృతి బీజేపీ రాష్ట్ర శాఖకు తీరని లోటు అని అన్నామలై పేర్కొన్నారు. శోకతప్తులైన మదన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. 1998, 1999 ఎన్నికల్లో మాస్టర్ మదన్ నీలగిరి నియోజకవర్గంలో బీజేపీ తరపున పోటీ చేసి గెలిచారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు నీలగిరి ఎంపీగా ఆయన ఎన్నికయ్యారు. అంతేకాకుండా రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడిగాను సేవలందించారు. మాస్టర్ మదన్‌కు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎస్పీ కారు ఢీకొని మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.10.20లక్షలు

● పదేళ్ల అనంతరం తీర్పు

ప్యారీస్, జూలై 27: కాంచీపురం జిల్లా ఎస్పీ కారు ఢీకొని మృతిచెందిన యువకుడి కుటుంబానికి రూ.10.20లక్షల పరిహారం అందించాలని కోర్టు తీర్పు వెలువరించింది. కాంచీపురం జిల్లా కావేరిపాక్కానికి చెందిన సురేష్ (25) ఘటన జరిగిన రోజు తన మోటరు సైకిల్‌పై కావేరిపాక్కం వైపుకు వస్తుండగా, వెనుకగా వేగంగా వచ్చిన ఎస్పీ కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో సురేష్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై కావేరిపాక్కం పోలీసులు విచారించి, కారు డ్రైవర్ కుళందైవేలుపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో పోలీసుల తరపున, సురేష్ అతివేగంగా మోటర్ సైకిల్ నడపడమే ప్రమాదానికి కారణమని, అతని లైసెన్స్ కూడా కాలపరిమితి ముగిసిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సురేష్ భార్యను కూడా విచారించారు. అయినా స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో, ఘటన జరిగిన రోజున చుట్టుపక్కల ఉన్న వారిని విచారించారు. వారిలో ఏకాంబరం అనే వ్యక్తి, తాను ఈ ఘటన 20 నుంచి 30 అడుగుల దూరం నుంచి చూశానని పేర్కొన్నాడు. అనంతరం న్యాయమూర్తి శరవణకుమార్ వెలువరించిన తీర్పులో... మృతుడి కుటుంబానికి కాంచీపురం జిల్లా పోలీసు కార్యాలయం రూ.10.20 లక్షల నష్టపరిహారం అందించాలని ఉత్తర్వులు జారీచేశారు. పదేళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం తమకు న్యాయం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన సమయంలో కాంచీపురం జిల్లా ఎస్పీగా ఉన్న విజయకుమార్ 2023లో తుపాకితో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం.



నీలగిరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు కుందా జోన్ పాకండి వద్ద రహదారిపై పడిన మట్టిపెళ్లలు

వచ్చే యేడాదిలోగా ఫార్చ్యూన్ వెల్త్‌లో రూ.500 కోట్ల సేకరణ

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సెబీ ఆధీకృత గుర్తింపు కలిగిన ఫార్చ్యూన్ వెల్త్ మేనేజ్‌మెంట్ కంపెనీ వచ్చే యేడాదిలోగా రూ.500 కోట్ల మేరకు నిధులు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు జోస్ సి.అబ్రహాం, కంపెనీ బిజినెస్ గ్రోత్ హెడ్ మేఘా జోస్ తెలిపారు. ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన జారీ చేస్తూ రెండు దశాబ్దాలకు పైగా పురోగమన దిశగా పయనిస్తున్న తమ కంపెనీ ప్రారంభంలో రూ.320 కోట్ల మేరకు నిధులను సేకరించిందని తెలిపారు. తమ కంపసెనీ కనీసపక్షంగా రూ.50లక్షల పెట్టుబడిని అంగీకరిస్తోందని వివరించారు.

విద్యార్థులకు 2 జతల యూనిఫాం

● మంత్రి గీతా జీవన్

అడయార్, జూలై 27: రాష్ట్ర వ్యాప్తంగా వారం లోగా పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందిస్తామని మంత్రి గీతా జీవన్ తెలిపారు. తూత్తుక్కుడి జిల్లా సామువేలపురం సాంఘిక సంక్షేమ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ జరిగింది. ఇందులో పాల్గొని ఆమె మాట్లాడుతూ... సీఎం స్టాలిన్ ఆదేశం మేరకు తూత్తుక్కుడి జిల్లాలో 79,654 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వారంలోగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందిస్తామని ఆమె తెలిపారు.

పన్రుట్టిలో 12 కిలోల నగల స్వాధీనం

ఐటీ అధికారుల ముమ్మర విచారణ

అడయార్, జూలై 27: పన్రుట్టి - చెన్నై రహదారిలో చిత్తరైచావడి బస్టాండు వద్ద ఒక కారులో కోయంబత్తూరుకు చెందిన కృష్ణన్ నుంచి స్వాధీనం చేసుకున్న 12 కిలో బంగారు నగలపై చెన్నై ఆదాయపన్ను శాఖ అధికారులు ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. ఇందుకోసం చెన్నై నుంచి అధికారుల బృందం పన్రుట్టికి వెళ్ళి కృష్ణన్‌ను విచారించింది. బన్రుట్టి ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో కోయంబత్తూరు నుంచి చెన్నైకి వెళుతున్న కారులో ఈ బంగారు నగలు పట్టుబడ్డాయి. అలాగే, ఆ కారులో ఉన్న శ్రీధర్ , కార్తికేయన్, జాన్‌ను కూడా బన్రుట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళగా వారిని ఐటీ అధికారులు విచారించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 27: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: పొన్నియమ్మన్ నగర్, గ్యాలెక్సీ, జీసస్ కాలని, వానగరం రోడ్డు, జేజే వీధి, టీఐ సైకిల్స్, రామ్‌నగర్, లెనిన్ నగర్, వెంకటేశ్వర నగర్, ఒరగడం, సీటీహెచ్ రోడ్డు, రెడ్‌హిల్స్ రోడ్డు, పద్మావతి శ్రీనివాస నగర్, కేవీ హాస్పిటల్ రోడ్డు

పల్లావరం: కలైవానర్ నగర్, కన్నాభిరాన్ వీధి, కోవలన్ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, తిరువేంగడ తమ్మిడయాన్, యూనియన్ కార్బైడ్ కాలని, నటేశన్ రోడ్డు, చర్చ్ వీధి, పల్లావరం ఈస్ట్

షోలింగనల్లూర్: పల్లికరనై, పెరుంబాక్కం, ధర్మలింగం నగర్, సాయిగణేష్ నగర్, పారివల్లల్ నగర్ ప్రాంతం, వాలై కంపెనీ ప్రాంతం, జల్లిడియాన్ పేట, ఏరికరై వీధి, ఆంజనేయ నగర్, మేడవాక్కం, కన్ని ఆలయం, సిత్తాలపాక్కం, మాంబాక్కం మెయిన్ రోడ్డు, సాస్తా నగర్, వీరభద్రన్ నగర్, రామ్ గార్డన్, కలైంజర్ నగర్, భవాని అమ్మన్ ఆలయ వీధి, ఫారెస్ట్ క్వార్టర్స్, నెహ్రూ నగర్

అడయార్: వీఓసీ నగర్ 1,2,3 వీధులు, మురుగా నగర్, శ్రీనివాస నగర్, జోసాని అపార్ట్‌మెంట్స్, దేవ్ అపార్ట్‌మెంట్స్ ఇష్యా హోమ్ అపార్ట్‌మెంట్స్, ఇందిరా నగర్, పనయూర్, గుడుమియాండి తోపు పాఠశాల రోడ్డు, ఖాయిదే మిల్లత్ రోడ్డు, వేలునాయకర్ వీధి, ఆదిత్యరామ్ నగర్, ఎన్నారై లే ఔట్, వీజీపీ సౌత్ అవెన్యూ, జె నగర్, సెమ్మొళి వీధి, పనయూర్‌కుప్పం ఏరియా, సియాసోర్ టౌన్ 1 నుంచి 13 అవెన్యూ, సముద్ర వీధి, రాజాజీ వీధి

ఐసిఎఫ్: ఈశ్వరన్ ఆలయం, కారపాక్కం, కేసీజీ కళాశాల రోడ్డు, కాళియమ్మన్ ఆలయం 1 నుంచి 7 వీధులు, కుప్పుస్వామి వీధి, గంగైఅమ్మన్ ఆలయ వీధి.





తాంబరం రైల్వేస్టేషన్ విస్తరణ పనులు ముమ్మరంగా చేపడతున్న కారణంగా ఆ మార్గంలో నడిపే సబర్బన్ రైళ్ల సేవలు తగ్గించారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం పోటెత్తడంతో తాంబరం జీఎస్టీ రోడ్డులో వాహనాల రాకపోకలు స్తంభించాయి

కేసుల పరిష్కారంలో హైకోర్టుకు ప్రథమ స్థానం

● న్యాయమంత్రి రఘుపతి

అడయార్, జూలై 27: కేసులను త్వరితగిన పరిష్కరించడంలో దేశంలోనే మద్రాస్ హైకోర్టు మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్ రఘుపతి తెలిపారు. విరుదునగర్ జిల్లా అరుప్పుకోటలో కొత్తగా నిర్మించిన కోర్టు భవనాల సముదాయాన్ని ఆయన శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... న్యాయశాఖకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనికి నిదర్శనమే నాలుగు జిల్లాల్లో కోర్టులకు కొత్త భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకున్నారన్నారు. బాధితులకు సత్వర న్యాయం లభించాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. న్యాయాన్ని పరిరక్షిస్తేనే దేశంలో సుస్థిరత నెలకొంటుందన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన నేత సీఎం స్టాలిన్ అన్నారు. ఇపుడు సైబర్, ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని, అందువల్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ తరహా నేరాలు పెరగడం వల్లే కోర్టులను ఆశ్రయించే బాధితుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిందని, ఈ కారణంగా కోర్టుల సంఖ్యను పెంచాల్సి వస్తుందన్నారు. మద్రాస్ హైకోర్టు పనితీరు ప్రశంసనీయంగా ఉందని, త్వరితగతిన కేసులను పరిష్కరిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

మెట్రోరైల్లో గంజాయి సేవించిన యువకుడి అరెస్ట్



మెట్రోరైలులో గంజాయి సేవిస్తున్న యువకుడు

ప్యారీస్, జూలై 27: మెట్రోరైలులో గంజాయి సేవించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ గురువారం తన ఎక్స్ పేజీలో, నగరంలో నడుపు తున్న మెట్రోరైలులో ఓ యువకుడు సిగిరెట్‌లో గంజాయి ఎక్కించే ఫొటో పోస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై చేపట్టిన విచారణలో... తేనాంపేట మార్గంగా వెళుతున్న మెట్రోరైలులో ఈ ఘటన జరిగిందని గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు, మెట్రో రైళ్లు, రైల్వేస్టేషన్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి, తేనాంపేటకు చెందిన స్విగ్గీ డెలివరీ బాయ్ భువనేష్‌ను అరెస్ట్ చేశారు. అతనికి గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, భువనేష్‌పై కాశిమేడు పోలీస్‌స్టేషన్‌లో హత్యా బెదిరింపు కేసు ఉన్నట్లు తెలిసింది.

బావిలో పడి తొమ్మిదేళ్ల బాలుడి మృతి

ప్యారీస్, జూలై 27: స్థానిక సెమ్మంజేరిలో బావిలో పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందాడు. సెమ్మంజేరి కులుకాత్తమ్మన్ ఆలయ వీధికి చెందిన లోకనాథన్ కుమారుడు మనోజ్(9) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి సమీపంలోని బావి వద్ద ఆడుకుంటున్నాడు. శిథిలావస్థకు చేరిన బావిని ఇనుప కమ్ములతో మూసివేయగా, ఎవరైనా లోనికి వెళ్లేలా చిన్న దారి మాత్రం ఉంది. ఈ నేపథ్యంలో, బావిపై కమ్ములపై ఆడుతున్న మనోజ్ హఠాత్తుగా చిన్న దారి గుండా లోపలికి పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా, వారు అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని, బావి నుంచి మనోజ్‌ను రక్షించి సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు ఫలించక మనోజ్ మృతిచెందాడు. మనోజ్‌కు ఈత రాదని, అతనిని రక్షించేందుకు అరగంట సమయం పట్టడంతో బాలుడు మృతికి కారణమని నిర్ధారించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రూ.16 లక్షల గుట్కా స్వాధీనం

ప్యారీస్, జూలై 27: స్థానిక అన్నాసాలైలో రూ.16 లక్షల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్న ఆహార భద్రతా విభాగం అధికారులు, పరారీలో ఉన్న దుకాణం యజమాని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. తిరువళ్లూర్ జిల్లా ఎరవూర్ ఇళగర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రెండు లారీల్లో ఉత్తరాది రాష్ట్రాల నుంచి 'రజనీకాంత్ వక్కన్' గుట్కా తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారణ జరపగా... అన్నాసాలైలో ఉన్న రాహుల్ ఏజెన్సీకి ఈ గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం సంబంధిత దుకాణంలో తనిఖీ నిమిత్తం వచ్చిన గుమ్మిడిపూండి పోలీస్ ఇన్‌స్పెక్టర్ వడివేల్ మురుగన్, అరవింద్‌ను అరెస్ట్ చేశారు. ఈ సమాచారంతో రూ.16 లక్షల విలువైన 4 టన్నుల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని దుకాణాన్ని సీజ్ చేశారు. పరారైన దుకాణ యజమాని కోసం గాలిస్తున్నారు.

సముద్రంలో బోల్తా పడిన బోటు

● ప్రాణాలతో బయటపడిన జాలర్లు

అడయార్, జూలై 27: తూత్తుక్కుడి హార్బర్‌కు సుమారు ఎనిమిది నాటికన్ మైళ్ల దూరంలో సముద్రంలో ఒక బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు జాలర్లు ప్రాణాలతో బయటపడ్డారు. తూత్తుక్కుడి థెర్మల్ నగర్ సమీపంలోని సునామీ కాలనీకి చెందిన మారియప్పన్‌కు చెందిన మరబోటులో అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణన్, శక్తివేల్, నాగరాజ్, శక్తివేల్, గణేష్, బాలా సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. వీరంతా చేపల వేటలో నిమగ్నమైవుండగా, బలమైన గాలులు వీయడంతో బోటు నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జాలర్లు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న భారత నావికా దళం ఆ జాలర్లను సురక్షితంగా తీరానికి చేర్చింది.

నాటు తుపాకీ కలిగిన ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 27: తిరుచ్చి సమీపంలో ద్విచక్రవాహనం వద్ద తుపాకీతో నిలబడివున్న ముగ్గురిని స్థానిక పోలీసులు అరెస్టులో చేశారు. వీరిలో దంపతుల జంట కూడా ఉంది. తిరుచ్చి జిల్లా మణక్కాల రైల్వే గేటు సమయంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒక ద్విచక్రవాహనం వద్ద ఆగివున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. పైగా వారివద్ద నాటు తుపాకీ ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తుపాకీ కలిగి ఉన్నందుకు రాము, మహేశ్వరి, శివరంజనిని అరెస్టు చేశారు. వీరిలో రాము, మహేశ్వరిలు దంపతులు కాగా, శివరంజని వారి బంధువని తేలింది. వీరిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

వీధి కుక్క దాడి: 11 మందికి గాయాలు

పెరంబూర్, జూలై 27: తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారం సమీపంలో వీధి కుక్క దాడితో రెండు రోజుల్లో 11 మంది గాయపడ్డారు. తియంపుదూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటనలో గాయపడిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు వేశారు. ఆ ప్రాంతంలో సంచరిస్తున్న 100కు పైగా వీధికుక్కలు బంధించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన లాయర్లపై చర్యలు

● బార్ కౌన్సిల్ ఛైర్మన్ అమల్‌రాజ్



మీడియాతో మాట్లాడుతున్న అమల్‌రాజ్

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన న్యాయవాదులపై కఠి న చర్యలు తీసుకుంటామని తమి ళనాడు, పుదుచ్చేరి న్యాయవాదుల బార్ కౌన్సిల్ ఛైర్మన్ అమల్‌రాజ్ ప్రకటించారు. శనివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో 16 మంది అరెస్టయ్యారని, వారిలో న్యాయవాదులు మలర్‌కొడి, సతీష్, హరిహరన్ ఉన్నారని చెప్పారు. ఆ ముగ్గురినీ బార్ కౌన్సిల్ నుంచి తొలగిస్తామన్నారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును దర్యాప్తు జరుపుతున్న పోలీసుల నుంచి సమగ్ర మైన నివేదిక అందగానే వారి తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

తింగలూరు సంతలో నకిలీ నోట్ల చెలామణి

నలుగురి అరెస్టు



అరెస్టయిన నలుగురు, స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు, వస్తువులు

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా పెరుందురై సమీపం తింగలూరు వారపు సంతలో నకిలీ నోట్లను చెలామణి చేసిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రతి గురు వారం జరిగే ఈ సంతలో కొందరు నకిలీ నోట్ల చెలామణీ చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తీవ్ర నిఘా ఏర్పాటు చేశారు. గత గురువారం ఆ సంతకు వచ్చిన సత్యమంగళం ఇక్కరైపల్లికి చెందిన జయపాల్ (70) ఓ వ్యాపారికి ఐదొందల నోటిచ్చి సరకులు కొనేందుకు ప్రయత్నించాడు. ఆ నోటు నకిలీదని గుర్తించిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఆ వృద్ధుడి కుమారుడు జయరాజ్(40) తన ఇంట్లో జిరాక్స్ మెషిన్ ద్వారా నోట్లను తయారు చేసినట్లు కనుగొన్నారు. ఆ నకిలీ నోట్లను జయపాల్, అతడి భార్య సరసు, కుమారుడు జయరాజ్, సహాయకురాలు మేరీ మెటిల్డాతో కలిసి సంతలో చెలామణీ చేశారని తెలుసుకున్నారు. వెంటనే నలుగురిని అరెస్టు చేసి, జిరాక్స్ మెషిన్, నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై ఏడాదిగా అత్యాచారం

ఎనిమిదిమంది అరెస్ట్

ప్యారీస్, జూలై 27: బాలికను ఏడాది కాలంగా గదిలో బంధించి అత్యాచారానికి పాల్పడిన 8 మంది కామాంధులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... దంపతులు విడిపోవడమే కాకుండా తమకు పుట్టిన బాలికను వదిలేసి వెళ్లిపోయారు. దీంతో స్థానికంగా ఉండే ఓ మహిళ ఆ బాలికను పెంచుకుంటోంది. ఈనేపథ్యంలో, ఆ చిన్నారి అత్యాచారానికి గురైనట్లు అందిన సమాచారంతో శిశు సంక్షేమ శాఖ అధికారులు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ సంరక్షణలో ఉన్న చిన్నారిని విడిపించి శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. విచారణ జరిపిన అధికారులు ఆ బాలిక చెప్పిన మాటలు విని విస్తుపోయారు. తనను సంరక్షిస్తున్న మహిళ సహా మరో ఇద్దరు మహిళలు తనను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టారని, ఐదుగురు తనపై ఏడాది పాటు అత్యాచారం చేసినట్టు తెలిపింది. దీంతో, ముగ్గురు మహిళలతోపాటూ బాలికను వేధించిన ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బాలికను పెళ్లాడిన యువకుడి అరెస్టు

అడయార్, జూలై 27: మాయమాటలు చెప్పి తిరుపతికి తీసుకెళ్ళి బాలికను వివాహం చేసుకున్న యువకుడిని నగర పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. 14 యేళ్ళ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 19వ తేదీన ఇంటి నుంచి వెళ్ళిన బాలిక తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అదే ప్రాంతానికి చెందిన యువకుడి(24)తో సన్నిహితంగా ఉన్నట్టు తెలిసింది. అంతేకాకుండా, ఆ బాలికను తీసుకెళ్ళి వివాహం చేసుకున్నట్టు తేలింది. ఆ తర్వాత మొబైల్‌లో యువకుడితో మాట్లాడిన పోలీసులు.. స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. దీంతో బాలికను స్టేషన్‌కు తీసుకొచ్చిన యువకుడిని పోక్సో చట్టం అరెస్టు చేసి జైలుకు పంపారు.

ఐదేళ్ల బాలికకు వేధింపులు : చిన్నాన్న అరెస్ట్

పెరంబూర్, జూలై 27: ధర్మపురి సమీపంలో ఐదేళ్ల బాలిక శరీరంపై వాతలు పెట్టి వేధించిన వ్యవహారంలో చిన్నారి చిన్నాన్నను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. పంగనహల్లిలో భర్తను వదలి జీవిస్తున్న అముద... తన కుమార్తె నిషా (5)ను సోదరి ఇంట్లో వదలిపెట్టి, అనారోగ్యంతో ఉన్న తల్లి చికిత్సల నిమిత్తం చెన్నైకి వెళ్లింది. నెల రోజుల అనంతరం ఇంటికి చేరుకున్న అముద, కుమార్తె శరీరంపై వాతలుండడం చూసి దిగ్భ్రాంతి చెంది పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనను విచారించిన పోలీసులు, బాలికను వేధించిన చిన్నాన్నను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ప్లస్ టూ పరీక్షల్లో సమాధానపత్రాల మార్పు

● 9 మంది అరెస్ట్

ప్యారీస్, జూలై 27: ఇద్దరు విద్యార్థుల కోసం ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలో సమాధాన పత్రాలు మార్చిన అధికారులు, టీచర్లు సహా 9 మందిని గ్రేటర్ చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. 2023లో నిర్వహించిన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల సమాధాన పత్రాలను విద్యాశాఖ అధికారులు సూపర్ చెక్ విధానంలో తనిఖీ చేశారు. అప్పుడు మదురైలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకున్న ఇద్దరు విద్యార్థుల సమాధానపత్రాల్లో ఒకే రకమైన చేతిరాత ఉండడాన్ని గుర్తించారు. అంతేకాకుండా ఆ విద్యార్థుల గణితం, సైన్స్ సహా మూడు జవాబుపత్రాల్లో కూడా ఒకేరకమైన దస్తూరి ఉంది. దీన్ని బట్టి ఒకే వ్యక్తి ఈ జవాబుపత్రాలు రాసినట్లు అనుమానించిన అధికారులు, సం బంధిత విద్యార్థుల మార్కుల జాబితాలను నిలిపివేశారు. ఈ వ్యవహారంపై విచారించిన అధికారులు సమాధాన పత్రాలు మార్చిన కేసులో మదురై జిల్లా ప్రాథమిక విద్య సూపరింటెండెంట్ రామప్రభాకరన్, సహాయ అధికారి కన్నన్, మేలూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాల టీచర్ పరమశివం, కొట్టాం బట్టి ప్రభుత్వ మహోన్నత పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్ కార్తీక్‌రాజా సహా విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి 9 మందిని అరెస్ట్ చేశారు.

77 దుకాణాల సీజ్

ఐసిఎఫ్, జూలై 27: స్థానిక కోడంబాక్కం మండల పరిధిలో అద్దె బకాయి చెల్లించని 77 దుకాణాలకు అధికారులు సీజ్ చేశారు. కార్పొరేషన్‌కు చెందిన స్థలాల్లో 500కు పైగా దుకాణాలు పని చేస్తున్నాయి. దుకాణదారులు పలు సంవత్సరాలుగా కార్పొరేషన్‌కు అద్దె చెల్లించకపోవడంతో అధికారులు నోటీసులు పంపారు. కొంతమంది అద్దె చెల్లించగా, మరికొంతమంది కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో అధికారులు పనగల్ పార్కులో 27 దుకాణాలు, కేకే నగర్‌లో 50 దుకాణాలను సీజ్ చేశారు.

యువతి ఫొటో మార్ఫింగ్: ఒకరి అరెస్ట్

పెరంబూర్, జూలై 27: మదురైకి చెందిన మహిళల ఫొటోలు అసభ్యంగా మార్ఫింగ్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, నగదును డిమాండ్ చేస్తున్న వ్యవహారంలో తిరుప్పూర్ ఆత్తుపాళయానికి చెందిన సూర్యను పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు బాధిత మహిళల ఫిర్యాదులను విచారించిన పోలీసులు... సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న మహిళా ఫొటోలను డౌన్‌లోడ్ చేసుకొని, వాటిని అసభ్య చిత్రాలుగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

ప్రియురాలితో యువకుడి ఘర్షణ

పెరంబూర్, జూలై 27: తిరుప్పూర్ జిల్లా అవినాశిలో వివాహం చేసుకోకుండా సహజీవనం సాగిస్తున్నట్లు పేర్కొంటున్న ప్రేమ జంట మధ్య తలెత్తిన విబేధాలతో బస్సులో వెళుతున్న ప్రియురాలిని అడ్డుకొని ఘర్షణకు దిగాడు ఆ యువకుడు. ఊహించని విధంగా చెయ్యిపై బ్లేడుతో గాయ పరచుకోవడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. యువకుడితో రెండు నెలలుగా సహజీవనం సాగిస్తున్న ఆ యువతి, అభిప్రాయ బేధాలతో ప్రభుత్వ బస్సులో కోవైకు బయల్దేరింది. బైక్‌పై వెళ్లిన యువకుడు బస్సును అడ్డుకొని, అందులో ఎక్కి యువతితో వాగ్వాదానికి దిగాడు. ఉన్నట్టుండి జేబులో ఉంచుకున్న బ్లేడుతో తన చేతిని గాయపరచుకున్నాడు. గమనించిన డ్రైవర్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడంతో, పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని ఆసుపత్రికి తరలించి విచారిస్తున్నారు.

జనాభా పెరుగుదల, అంటు వ్యాధులు, యుద్ధాలవల్ల ప్రపంచ స్థాయిలో ఆకలిదప్పుల కారణంగా అనారోగ్యం పాలవుతున్నవారి సంఖ్య 82.8 కోట్లకు పెరిగిందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభాలో 29.3 శాతం మంది ఆహార భద్రతా లేమితో బాధపడుతున్నారు. 2021 జనాభా లెక్కల ప్రకారం ఆకలితో బాధపడుతున్నవారి శాతం 9.8 శాతానికి పెరిగింది. ఇది 2020లో 9.3 శాతంగా ఉంది. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన 4.5 కోట్ల మంది చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. పౌష్టికాహార లోపం కారణంగా మృతి చెందుతున్న చిన్నారుల సంఖ్య 12 రెట్లకు అధికమైంది. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన 14.9 కోట్ల మంది చిన్నారులు ఆహారంలో బలవర్ధకమైన విటమిన్లు లేకపోవడం వల్ల ఎదుగుబొదుగులేక కొట్టుమిట్టాడుతున్నారు. ఇక ఆహారం వల్ల రోగాలబారిన పడి మృతి చెందుతున్నవారి సంఖ్య యేటా 4.20 లక్షలుగా ఉంటోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. జర్మనీకి చెందిన ఓ సంస్థ సర్వే ప్రకారం ఆకలి, పస్తుల వల్ల ప్రతి 13 సెకన్లకు ఓ పసిబిడ్డ మృతి చెందుతోంది.


- ఆంధ్రజ్యోతి, చెన్నై

ఆకలిదప్పులు... ఆహార పదార్థాలు





సండే స్పెషల్...



పోషకాలు లేని ఆహారం...

మనం తినే ఆహారంలో పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు, ధాన్యాలు, పప్పుదినుసులు సరైన పాళ్లలో లేవు. ఒక వేళ ఇవన్నీ లభించినా అవన్నీ నాసిరకం నూనెలతో వేయించి చేసినవి, చెడామడా ఉడికించినవే తింటున్నాం. పూర్వం రాత్రంతా నిల్వ ఉంచిన పాలు, పెరుగు తోడేసి కలిపిన చల్దిఅన్నం తిన్న భారతీయులు ప్రస్తుతం రోజుల తరబడి ఫ్రిజ్‌లో భద్రపరచిన మాంసం, స్వీట్లను తినడమే కాకుండా క్యాన్డ్ శీతలపానీయాలు తాగుతున్నారు. నెల రోజులకు పైగా నిల్వ ఉంచిన ఆహాపదార్థాలను తింటున్న దేశాల్లో భారతదేశం ప్రథమస్థానంలో ఉందనడం అతిశయోక్తి కాదు. ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక సంపన్న దేశంగా ఉన్నత స్థితిలో ఉన్న భారత్‌లోనే 71 శాతం మందికి శక్తివంతమైన పోషక పదార్థాలు కలిగిన ఆహారం అందుబాటులో లేదని అంతర్జాతీయ పౌష్టికాహార సంస్థ నివేదిక కుండబద్ధలు కొట్టినట్లు చెబుతోంది.

ప్రతి తొమ్మిది మందిలో ఒకరు...

ప్రపంచ జనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్రతి తొమ్మిదిమందిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారపదార్థాలలో మూడింట ఒక వంతు వృథా అవుతోంది. ప్రతి భారతీయుడు యేడాదికి 50 కిలోలకు పైగా ఆహారపదార్థాలను వృథాగా పారవేస్తున్నాడు. 20 యేళ్లకు పైబడిన యువకులు రోజూ 200 గ్రాములు చొప్పున పండ్లు తినాలని ప్రతిపాదిస్తున్నారు. అయితే 35.8 గ్రాముల వరకే తింటున్నారు. రోజూ 300 గ్రాముల కూరగాయలు తినాలని ప్రతిపాదిస్తుండగా 168.7 గ్రాముల కూరగాయలే (అదీ ఫ్రిజ్‌లలో వారాల తరబడి నిల్వ ఉంచినవే) తింటున్నారు. ఆహారం కోసం ప్రతి వ్యక్తి సంపాదనలో 63 శాతం ఖర్చు చేస్తున్నా ఆ ఆహారంలో ఎలాంటి పోషకాలు లేవు.

పెరిగిన ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి...

గతంలోనగరాలకే పరిమితమైన ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి గ్రామాలకు పాకింది. ఉప్పు, మసాలాలు అధికంగా ఉన్న నూనెతో వేపుడు చేసిన ఆహార పదార్థాలను, గంటల తరబడి ఉడికించిన మాంసాహారం తినడం అధికమైంది. పిజ్జా, బర్గర్, ఫ్రైడ్ రైస్ అంటూ భావిభారతపౌరులైన చిన్నారులకు హాని కలిగించే ఆహార పదార్థాలను అందిస్తున్నారు. భవిష్యత్తులో ఆ చిన్నారులు పిన్న వయస్సులోనే వృద్ధాప్యాన్ని అనుభవించే స్థాయికి చేరుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్ వల్ల రోగనిరోధక శక్తి క్షీణిస్తుందని తెలిసినా, అందరూ వాటిని ఆబగా తినే సంస్కృతి అధికమైంది. ఏ శీతలపానీయంలో క్రిమి సంహారక మందులు అధికంగా ఉన్నాయని రుజువైందో వాటినే ప్రజలు అధికంగా తాగడం ఫ్యాషనైపోయింది. ఆరోగ్యానికి చేటు కలిగించే రసాయనిక పదార్థాలున్నాయని ప్రభుత్వం నిషేధించిన నూడుల్స్ విక్రయాలు ఆ నిషేధం తొలగిన తర్వాత విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం హోటళ్లలోనూ రుచికరమైన శుచికరమైన ఆహారపదార్థాలు లభించడం లేదు. శాఖాహారమైనా, మాంసాహారమైనా ఏ నూనెతోనో వేయించినవే సైడ్ డిష్‌గా ఉంటున్నాయి. వీటిని తిన్నవెంటనే జీర్ణం కావడానికి సోడాలు (గోళీ సోడాలు కావు) తాగే సంస్కృతి కూడా వచ్చేసింది. రోడ్‌సైడ్ దుకాణాలలో అమ్మే ఆహార పదార్థాలు, స్టార్‌హోటళ్లలో లభించే ఫ్రైడ్ రైస్‌ల వల్ల పిన్నవయస్సులోనే ఊబకాయంతో, చర్మవ్యాధులు, జీర్ణకోశ వ్యాధులకు తోడు నపుంసకత్వం కూడా వస్తుందని ప్రముఖ డైటీషియన్లు హెచ్చరిస్తున్నారు. ఏ వస్తువును వాడొద్దని ప్రభుత్వం హెచ్చరిక జారీ చేస్తుందో ఆ వస్తువునే అధికంగా వాడటం అందరికీ ఫ్యాషనైపోయింది.

పరిష్కార మార్గాలు...

భావిభారత పౌరులను ఈ ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ నుంచి, వాటివల్ల కలిగే రోగాల నుండి కాపాడేందుకు పరిష్కార మార్గాలున్నాయి. మన పూర్వీకులు, మన తాతముత్తాల కాలంలో ఏ ఆహార పదార్థాలను తినేవారో వాటిని వెదికి పట్టుకుని తినడమే చక్కటి పరిష్కారం. రోజువారీ ఆహారంలో దంచిన ఉప్పుడు బియ్యం, సజ్జలు, రాగులు, నూకలు, తాజా కాయగూరలు, తాజా పండ్ల రసాలకు చోటు కల్పిస్తే చాలు. చలువనిచ్చే పెరుగు, మజ్జిగ తప్పనిసరిగా వాడాలి. రాత్రంతా పెరుగు, పాలతో కలిపిన అన్నాన్ని మరుసటి రోజు చల్ది అన్నంగా ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయను నంజుకుని తినాలి.

మళ్లీ పాతకాలంలోకి... : వాట్సప్, ఇన్‌స్టాగ్రాంల పుణ్యమా అని ఈ చల్ది అన్నానికి ప్రజలలో విపరీతమైన క్రేజ్ వచ్చింది. ప్రస్తుతం చెన్నై, కోయంబత్తూరు, మదురై తదితర నగరాలలో నివసించే ప్రజలు చల్ది అన్నం లభించే హోటళ్లను వెదుక్కుంటూ వెళ్తున్నారు. వంటనూనెల ప్యాకెట్లకు స్వస్తి చెప్పి గానుగాడించి నూనెల వైపు ప్రజల దృష్టి మరలుతోంది. ఇప్పుడిప్పుడే నగరాలలో గానుగాడించి నూనెలు అమ్మే దుకాణాలు విరివిగా పుట్టుకొస్తున్నాయి. ప్యాకెట్లలో అమ్మే మసాల వస్తువులకు చరమగీతం పాడాలి. పిండిమరలలో ధనియాలు, గుంటూరు మిరపకాయలను సమపాళ్లలో ఇచ్చి దంచి పొడి చేసి ఆరబెట్టి ఇంట్లో నిలువ పెట్టుకుని వాడే ఆ పాతరోజులు రావాలి. ప్రతి ఇంటా తిరగలి వాడకం అధికం కావాలి. ఇక నగరాల్లో కుక్కర్‌లో బియ్యాన్ని ఉడికించే పద్ధతికి స్వస్తి గంజినివార్చే పాత పద్ధతిని అవలంబిస్తున్నారని ఓ సర్వే ద్వారా వెల్లడవుతోంది. ఇలా అన్నాన్ని గంజి వార్చేందుకు ఇనుప, స్టీల్ స్టాండ్ల అమ్మకాలు విపరీతంగా పెరుగుతుండటాన్ని బట్టి ఈ విషయం రుజువైంది. ఇక నగరం నలుమూలల సజ్జ, రాగులతో తయారైన అంబలి అమ్మకాలు, రాగి, జొన్న సంగటి అమ్మకాలు కూడా ఊపందుకుంటున్నాయి. దుకాణాలలో, చిన్న సైజు హోటళ్లలో లభించే వీటన్నింటిని ఇంటిపట్టునే తయారు చేసుకుని తింటే ఆహా ఏమి రుచి అని అందరూ ఆనందించవచ్చు. ఇక త్వరపడండి పాతచింతకాయ పచ్చడి, ఆవకాయ, గోంగూరు పచ్చడి, మీగడ పెరుగు, వెన్న తేలే మజ్జిగ, చెరువు చేపల కూర, రొయ్యల వేపుడు, నాటుకోడిగుడ్డు అట్టు, పెసరట్లు, పచ్చిపులుసు అంటూ ఇంటింటా తయారు చేసుకుని ఆరగిద్దాం. ఆరోగ్యంగా ఉందాం.

నేను సినిమాలను చేస్తూనే ఉంటా

● నిర్మాతల మండలికి విశాల్ కౌంటర్



తనతో నిర్మాతలు సినిమా నిర్మించవద్దంటూ తమిళ సినీ నిర్మాతల మండలి తాజాగా చేసిన తీర్మానంపై హీరో విశాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సినిమాల్లో నటిస్తూనే ఉంటానని, చేతనైతే ఆపండి అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'నేను సినిమాలు చేస్తూనే ఉంటాను. మీ పని మీరు చేసుకోండి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నేను మాత్రం సినిమాలు చేయడం మానుకునేది లేదు. ఒక వేళ నన్ను ఆపే ప్రయత్నం చేస్తే నిర్మాతలమని చెప్పుకునే కొందరు ఎన్నటికీ సినిమాలు తీయలేరు. నా హయాంలో నిర్మాతల మండలి సభ్యుల సంక్షేమానికి నిధులు ఖర్చు చేశాం. వృద్ధులు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఆరోగ్య బీమా కల్పించాం. ఇలాంటి అనేక సంక్షేమ నిర్ణయాలు సహచర సభ్యులతో కలిసి తీసుకున్నవి. మీ పని మీరు సక్రమంగా చేయండి. పరిశ్రమ కోసం ఎంతో చేయాల్సి ఉంది. రెట్టింపు పన్ను, థియేటర్ నిర్వహణ ఖర్చుల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. నేను సినిమాలు చేస్తూనే ఉంటాను. నన్ను ఆపే ముందు ఓ సారి ఆలోచించుకోండి' అని విశాల్ హితవు పలికారు.

అవార్డుల కోసం ఎవరూ సినిమాలు తీయరు

● 'కొట్టుక్కాలి' దర్శకుడు వినోద్‌రాజ్

అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో అవార్డుల కోసం ఏ ఒక్క దర్శకుడు సినిమాలను రూపొందించరని, ఆ చిత్రం కంటెంట్ బాగుంటే అవార్డులు వరిస్తాయని 'కొట్టుక్కాలి' చిత్ర దర్శకుడు పీఎస్ వినోద్‌రాజ్ అన్నారు. ఈయన దర్శకత్వం వహించిన తొలి సినిమా 'కూళంగల్' అనేక ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లలో అవార్డులను గెలుచుకోవడమేకాకుండా ప్రేక్షకాదారణ పొందింది. రెండో చిత్రంగా 'కొట్టుక్కాలి'ని రూపొందించారు. సూరి, అన్నా బెన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని హీరో శివకార్తికేయన్ ఎస్‌కే ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించారు. వచ్చే నెల 23వ తేదీన విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం వివరాలను దర్శకుడు పీఎస్ వినోద్‌రాజ్, సహ నిర్మాత కలైలు విలేకరులకు వివరించారు. 'ఈ సినిమా ద్వారా మలయాళ నటి అన్నాబెన్ కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ట్రాన్సిల్వేనియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక జ్యూరీ అవార్డును గెలుచుకుంది. నా తొలి చిత్రం 'కూళంగల్' కూడా అనేక అవార్డులను గెలుచుకుంది. ఈ సినిమా కూడా ఇప్పటికే పలు అవార్డులను సొంతం చేసుకుంది. వాస్తవిక జీవన పరిస్థితులకు అద్దంపట్టేలా సినిమా తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు అవార్డులు రివార్డులు వాటంతట అవే వస్తాయి. నా రెండు చిత్రాలు దీన్ని నిరూపించాయి. నేను రాసుకున్న స్క్రీన్‌ప్లేను యథావిధిగా తెరపై చూపించేందుకు హీరో శివకార్తికేయన్ అవసరమైన ఆర్థిక సాయంతో అండగా ఉన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎదురైన, ఎదుర్కొంటున్న సంఘటనల సమూహారమే ఈ చిత్ర కథ. ఇది ఒక జర్నీ స్టోరీ. ఆ ప్రయాణంలో ఒక గ్రామ ప్రజల జీవనగాథను వివరించాం. ఇందులో కోడిపుంజు కూడా ఒక పాత్రగా సాగుతుంది. 'కొట్టుక్కాలి'... ఒక గ్రామంలో ఎంతో ధైర్యసాహసాలతో చలాకీగా ఉండే ఒక మహిళ. ఈ సినిమాలో హీరోయిన్ అలాంటి మహిళ. అందుకే చిత్రానికి 'కొట్టుక్కాలి' అనే పేరు పెట్టాం. సూరి ఇప్పుడు కమర్షియల్ హీరో కావడంతో ఆయన పాత్ర మరో పరిణామం క్రమంలో ఉంటుంది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు లేరు. సహజ సిద్ధమైన ధ్వనులను అయా సన్నివేశాలకు అనుగుణంగా సంగీతంగా ఉపయోగించాం. సినిమా చూస్తుంటే సంగీతం లేదనే భావన కలగదు. ఇది ఒక రకంగా ప్రయోగమనే చెప్పాలి. ఈ చిత్ర కథ విషయానికి వస్తే.. ఇది ఒక అడమెంట్ గర్ల్ స్టోరీ. స్త్రీపై భూత వైద్యం, వశీకరణ, పితృస్వామ్యం, మహిళల పట్ల జరిగే అన్యాయాలను ముఖ్యాంశాలుగా చూపించాం' అని వారు వివరించారు.



'కొట్టుక్కాలి'లో అన్నాబెన్

చిత్రజ్యోతి

మహిళా జర్నలిస్టును వేధించిన జాన్ విజయ్

● చిన్మయి



వివాదాస్పద సినీ నేపథ్యగాయని చిన్మయి శ్రీపాద మరోమారు వార్తలకెక్కారు. 'సలార్' చిత్రంలో నటించిన జాన్ విజయ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఆయన ఒక మహిళా జర్నలిస్టును వేధించారంటూ చిన్మయి తాజాగా ఓ పోస్ట్ చేశారు. గతంలో మహిళా జర్నలిస్టును వేధించిన ఆయన... తనతో చాలా అసభ్యంగా ప్రవర్తించారని సోషల్ మీడియాలో వెల్లడించారు. పబ్‌లు, రెస్టారెంట్లు, ఇతర ప్రదేశాల్లో ఆడవాళ్ళతో జాన్ విజయ్ అసభ్యకరంగా ప్రర్తించారన్నారు. జాన్ విజయ్ డీఎంకే వ్యక్తి అని, ఆయన పాటల రచయిత వైరముత్తు ఒకే జాతికి చెందినవారని చిన్మయి శ్రీపాద ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి కంటికి మహిళలు కనిపిస్తే చాలు రెచ్చిపోతారంటూ మండిపడ్డారు. ఈ పోస్టు వైరల్‌గా మారడంతో నెటిజన్లు తమకు తోచిన తీరిలో కామెంట్స్ చేస్తున్నారు.

● ప్రజలతో ముఖ్యమంత్రి పథకం

ఐదు జిల్లాల కలెక్టర్లతో స్టాలిన్ సమీక్ష



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించే శిబిరాలు నిర్వహణపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం ఐదు జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ జిల్లాల్లో ఇప్పటివరకూ ప్రజలను వినతి పత్రాలు స్వీకరించేందుకు నిర్వహించిన శిబిరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరుప్పూరు జిల్లా కలెక్టర్ క్రిస్తురాజ్, నాగపట్టినం కలెక్టర్ పి.ఆకాష్, మదురై కలెక్టర్ ఎం.ఎస్. సంగీత, వేలూరు కలెక్టర్ వీ.ఆర్.సుబ్బులక్ష్మి, తూత్తుకుడి కలెక్టర్ లక్ష్మీపతి ముఖ్యమంత్రి స్టాలిన్ అడిగిన ప్రశ్నలన్నింటి తగిన వివరాలతో సమాధానాలిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ఎస్.మురుగానందం, ముదల్వరిన్ ముగవరి పథక ప్రత్యేక కార్యదర్శి పి.అముద తదితర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పాంబన్ వంతెన నిర్మాణం

● బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్న రైల్వే ఉద్యోగులు

పెరంబూర్, జూలై 27: పాంబన్ కొత్త రైలు వంతెన మధ్య లో లిఫ్ట్ వంతెన నిర్మాణం విజయవంతంగా ముగియడంతో రైల్వే నిర్మాణ విభాగ ఉద్యోగులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పాంబన్ సముద్రంలో రూ.550 కోట్లతో 2018లో ప్రారంభమైన కొత్త వంతెన నిర్మాణం ప్రస్తుతం ముగిసింది. అందులో 200 టన్నుల బరువుతో కూడిన లిఫ్ట్‌ను (నౌకలు వెళ్లేందుకు వసతిగా రెండు భాగాలుగా విడిపోయే ప్రాంతం) 40 రోజుల నుంచి క్రమక్రమంగా ఆ ప్రాంతానికి తీసుకొచ్చి, శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వంతెనపై ఉంచారు. లిఫ్ట్ వంతెన ఏర్పాటు విజయవంతం కావడంతో ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. ఈ వంతెనపై అక్టోబరు 1వ తేది నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభమవుతాయని దక్షిణ రైల్వే ఇదివరకే ప్రకటించింది.



బాణసంచా వెలుగుల్లో పాంబన్ వంతెన

రేలా హాస్పిటల్‌లో అథ్లెట్లకు ఉచిత వైద్యసేవలు



అభినవ్ బింద్రా, సోర్ సంస్థల నిర్వాహకులతో రేలా హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా తదితరులు

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో రాష్ట్రానికి చెందిన ఒలంపియన్లను గౌరవించే దిశగా అథ్లెట్లకు ఉచిత వైద్యసేవలు అందించడానికి వీలుగా అభినవ్ బింద్రా ఫౌండేషన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే విధంగా అథ్లెట్లకు వెన్నెముక చికిత్సలందించడానికి అనువుగా సోర్ (స్పైన్ అండ్ ఆర్థోపెడిక్స్ యాక్షన్ అండ్ రిసెర్చ్) ట్రస్టుతోనూ భాగస్వామ్యం కుదుర్చుకుంది. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఆ హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా ప్రకటించారు. ప్యారీస్ ఒలంపిక్స్ అట్టహాసంగా ప్రారంభమైన సందర్భంగా తమ ఆసుపత్రిలో అథ్లెట్లకు ఉచిత వైద్య సేవలందించడానికి రెండు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. రేలా హాస్పిటల్ ఆర్థోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ హెడ్ డాక్టర్ ప్రకాష్ అయ్యాదురై, ఆ రెండు సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించి కొత్త పథకాలు, నిధుల కేటాయింపులు లేకపోవడాన్ని నిరసిస్తూ సైదాపేట వద్ద జరిగిన ధర్నాలో ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు





చెన్నై నగరంలోని చూలై రామయ్య వీధిలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం వద్ద చిన్నారుల నివాళి



ఒలింపియన్లకు సన్మాన దృశ్యం

ఐదుగురు ఒలింపియన్లకు షరాన్‌ప్లై సత్కారం

అడయార్, జూలై 27: ప్యారిస్ వేదికగా ఒలింపిక్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రముఖ ప్లైవుడ్ కంపెనీ షరాన్‌ప్లై..నగరంలో 'ఐ యామ్ స్ట్రాంగెస్ట్ అవార్డు' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి, ఐదుగురు ఒలింపియన్స్‌ను సన్మానించింది. ఈ సన్మానం అందుకున్న వారిలో వాసుదేవన్ భాస్కరన్, మునీస్ సేర్, చార్లెస్ కార్నెలియస్, విక్టర్ జాన్ ఫిలిప్స్, కృష్ణమూర్తి పెరుమాళ్ ఉన్నారు. వీరికి జ్ఞాపికలతో పాటు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. అవార్డు గ్రహీతలందరూ పెట్ బాటిళ్లను రీసైకిల్ చేసి తయారుచేసిన ప్రత్యేక బ్లేజర్లు, షర్టులు ధరించారు.ఇలాంటివాటిని గత యేడాది ప్రధానమంత్రి నరేంద్ర మోదీగా కూడా ధరించారు. పర్యావరణ పరిరక్షణలో షరాన్‌ప్లై సామాజిక బాధ్యతను గుర్తుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో షరాన్‌ప్లై ఫౌండర్ విష్ణు ఖేమాని, రిటైర్డ్ జడ్జి ఎం.జయచంద్రన్, యెన్నెస్ ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ఎస్ శరవణన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత అనిత పెల్లురై తదితరులు పాల్గొన్నారు.

కార్ రేస్‌కు ముస్తాబవుతున్న ఐల్యాండ్ గ్రౌండ్ చుట్టుపక్కల రోడ్లు



కార్ రేస్‌కు సిద్ధమవుతున్న శివానంద రోడ్డు

పెరంబూర్, జూలై 27: నగరంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో జరగనున్న ఫార్ములా-4 కార్ రేస్ పోటీలను పురస్కరించుకొని ఐల్యాండ్ గ్రౌండ్ చుట్టూ 3.5 కి.మీ రోడ్లు మరమ్మతులులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దేశంలో తొలిసారిగా ఈ పోటీలు రాత్రి వేళ జరగనున్నాయి. ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే రేస్... అన్నాసాలై, శివానంద రోడ్డు, నేపియర్ బ్రిడ్జి మీదుగా మళ్లీ ఐల్యాండ్ గ్రౌండ్ వద్ద ముగుస్తాయి. ఈ పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.42 కోట్లు విడుదల చేసిన విషయం విదితమే.

నేడు 'చాటు పద్యము - హాస్యము'పై వేద విజ్ఞాన వేదిక ప్రసంగ కార్యక్రమం

అడయార్, జూలై 27: నగరానికి చెందిన వేద విజ్ఞాన వేదిక (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో ప్రతి నెలా జరిగే తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో 151వ ప్రసంగంగా 'చాటు పద్యము - హాస్యము' అనే అంశంపై గుంటూరు నగరానికి చెందిన హిందూ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగిస్తారు. స్థానిక టి.నగర్‌లోని ఆస్కా ప్రాంగణం (ఆంధ్ర క్లబ్)లోని కృష్ణా హాల్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ధారావాహిక ప్రసంగం ప్రారంభమవుతుందని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధులు శనివారం సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని సాహితీ ప్రియులందరూ పాల్గొనవచ్చని వారు వెల్లడించారు.